

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 520.90 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 826.80 అడుగుల వద్ద ఉంది.



దుర్గమ్మను దర్శించుకున్న జస్టిస్ వెంకటరమణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మను మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ డి. వెంకటరమణ బుధవారం దర్శించుకున్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి టౌన్ : గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌లో బుధవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ. 4వేలు, గరిష్ట ధర రూ. 4,800లు, మోడల్ ధర రూ. 4,400లు వరకు పలికింది.

న్యూస్‌రీల్

నగరపాలక సంస్థ సీఎంఓహెచ్‌గా డాక్టర్ ఆషా



నెహ్రూనగర్ : గుంటూరు నగరపాలక సంస్థ నూతన సీఎంఓహెచ్‌గా ఏలూరు జిల్లా నూజివీడు డెప్యూటీ డీఎంహెచ్ఓగా విధులు నిర్వహిస్తున్న సివిల్ సర్జన్ డాక్టర్ డి.ఆషాని బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం నగర కమిషనర్ కీర్తి చేకూరిని ఆమె ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలో మెరుగైన పారిశుధ్యం అందించడంలో ప్రజారోగ్య విభాగం మరింత బాధ్యతగా పని చేసేలా కృషి చేయాలని సీఎంఓహెచ్‌కు కమిషనర్ కీర్తి సూచించారు.

సంక్రాంతి సెలవులు పొడిగింపు

ఈనెల 22న పాఠశాలలు పునఃప్రారంభం

గుంటూరు ఎడ్యుకేషన్ : సంక్రాంతి సెలవులను ఈనెల 20వ తేదీ వరకు పొడిగిస్తూ విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్‌కుమార్ ఉత్తర్వులు విడుదల చేసినట్లు డీఈవో పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలు ఈనెల 22న పాఠశాలలను పున: ప్రారంభించాలని పేర్కొన్నారు. సెలవుల్లో పదో తరగతి సహా విద్యార్థులెవ్వరికీ తరగతులు నిర్వహించేందుకు వీల్లేదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే గుర్తింపు రద్దుతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

పోస్టుల భర్తీకి ఆహ్వానం

గుంటూరు మెడికల్ : గుంటూరు జిల్లాలో ఖాళీగా ఉన్న డాక్టర్లు, డ్రైవర్ల పోస్టుల భర్తీకి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ పాతపాటి బాల చంద్రుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ పోస్టులకు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత అవసరం. డ్రైవర్ పోస్టులకు 2–3 సంవత్సరాల అనుభవంతో హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో అనుభవజ్ఞులైన అభ్యర్థులు అవసరం. మరిన్ని వివరాలకు జిల్లా మేనేజర్ బాల చంద్రుడు మొబైల్ నంబర్ 90328 76888లో సంప్రదించాలన్నారు.

తైక్వాండోలో ముగ్గురికి స్వర్ణం




తెనాలిఅర్బన్: జిల్లాస్థాయి తైక్వాండో పోటీలలో తెనాలిలోని యూనిక్ తైక్వాండో అకాడమీకి చెందిన ఎ.జాహ్నవి, జి.వెంకట శ్రీమంత్, ఎ.చరణ్‌తేజ్‌లకు బంగారు పతకాలు లభించినట్లు కోచ్ బట్టు నాగరాజు తెలిపారు. ఈ నెల 7న మంగళగిరిలో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. అలాగే వీరిని రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జట్టుకు ఎంపిక చేసినట్లు వివరించారు. బుధవారం అకాడమీ ఆవరణలో వీరిని అభినందించి, మెడల్స్, సర్టిఫికెట్‌లు అందజేశారు.

రెవెన్యూ అధికారుల బదిలీలు

గుంటూరు వెస్ట్:గుంటూరు కలెక్టరేట్‌లో ఏఓగా పనిచేస్తున్న ఎం.పూర్ణచంద్రరావును వెంకటాచలం తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. గుంటూరు ఆర్డీవో కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న షేక్ ఇస్మాయిల్ విడవలూరు తహసీల్దార్‌గాను, తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న జి.వెంటకస్వామిని రాపూరుకు, రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న పి.జాన్‌పీటర్‌ను దగదర్తి తహసీల్దార్‌గా, గురజాల ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్.శివనాగిరెడ్డిని ఆత్మకూరు తహసీల్దార్‌గా, బాపట్లలో ఏఓగా పనిచేస్తున్న కె.గోపీకృష్ణను చీరాల తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ చీఫ్ కమిషనర్ ఎం.డి.ఇంతియాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

టెన్నిస్ పోటీలకు క్రీడాకారులు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో గురువారం నుంచి జరగనున్న 67వ జాతీయ స్కూల్ గేమ్స్ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు స్థానిక ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులు బాల మనోజ్, చరణ్, షేక్ అబ్రాల్ ఎంపికయ్యారని కోచ్ జీవీఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల మనోజ్, చరణ్‌లు అండర్–19, షేక్ అబ్రాల్ అండర్–17 విభాగాల్లో పోటీ పడతారన్నారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారులను స్టేడియం టెన్నిస్ సభ్యులతోపాటు రేమండ్స్ అధినేత టి.అరుణ్ కుమార్ అభినందించారన్నారు.

మైనార్టీల అభివృద్ధికి అండ

- సీఎం వైఎస్ జగన్ హయాంలో మైనార్టీలకు ఎంతో మేలు
- నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిన మహానేత వైఎస్సార్ బాటలోనే సీఎం వైఎస్ జగన్
- 55 నెలల్లో మైనార్టీల ఖాతాల్లో రూ.26వేల కోట్ల నగదు బదిలీ
- మంత్రి పదవులు, పార్టీ పదవులు, కార్పొరేషన్ల నియామకాలు, స్థానిక సంస్థల్లో పెద్దపీట
- ప్రతిపక్షాల దుష్ప్రచారాలు నమ్మొద్దు
- 'జగన్ పాలన – మైనార్టీల స్పందన'పై రాష్ట్ర ప్రజాస్థాయి సదస్సులో వక్తలు వెల్లడి



నగరంపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు పెద్దపీట వేసినట్లు గణాంకాలు చెబుతున్నాయని ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ వీవీఆర్ కృష్ణంరాజు అన్నారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు తాలుకా పెన్షనర్స్ హాల్‌లో బుధవారం 'జగన్ పాలన – మైనార్టీల స్పందన' పై రాష్ట్రస్థాయి ప్రజా సదస్సు జరిగింది. ఏసీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ పి.ముత్యం సదస్సుకు అధ్యక్షత వహించి మాట్లాడారు.

• ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ పేద వర్గాల్లోని ముస్లింల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ కృషి చేశారని చెప్పారు. మైనార్టీల తరఫున ఒకరికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వడం చాలా సంతోషకరమని అన్నారు. రెవ.నవ కుమార్ మాట్లాడుతూ ఇంటి బయట సైకిల్, టేబుల్‌పై గ్లాస్ ఉండాలని, అయితే ఫ్యాన్ గాలి కింద ప్రజలు హాయిగా ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ మాట్లాడుతూ గ్రంథాలయ చరిత్రలో ఎస్సీలను నియమించిన దాఖలాల్లేవని అన్నారు. వైఎస్ జగన్ హయాంలో రాష్ట్ర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లను నియమించడం శుభపరిణామమని చెప్పారు. పొన్నూరు మసీదు ప్రచార కార్యదర్శి షేక్ అబ్దుల్‌నాజర్ మాట్లాడుతూ గతంలో హజ్‌యాత్రకు వెళ్లాలంటే అనేక ప్రయాసలకు గురికావాలని, ప్రస్తుతం అనేక మౌలిక సౌలభ్యాలను కల్పించారని చెప్పారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కరిముల్లా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మైనార్టీలకు కార్పొరేషన్ల కేటాయింపులో అగ్రతాంబూలం ఇచ్చారని అన్నారు. ఆంధ్రా అడ్వొకేట్స్ ఫోరం కన్వీనర్ బి.అశోక్ కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ హయాంలో అందరూ హాయిగా ఉన్నారన్నారు. న్యాయవాది షేక్ లియాఖత్‌అలీ మాట్లాడుతూ మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ దిక్సూచీగా ఉన్నారని అన్నారు. నలుగురు మైనార్టీల ఎమ్మెల్యేలు ఉంటే అందులో ఒక ఉప ముఖ్యమంత్రి, మండలి వైస్ చైర్మన్‌గా మైనార్టీ మహిళను నియమించారని ఆయన గుర్తు చేశారు. కార్పొరేటర్ బూసి రాజలత మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని అన్నారు. బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు మేడిద జాన్సన్, విశ్రాంత తహసీల్దార్ విక్టర్‌పాల్, భాగ్యరావు, పి.సుందరరావు, సత్యనారాయణరెడ్డిలు మాట్లాడారు.

ముస్లింలు సీఎం వైఎస్ జగన్ వెంటే..



జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలీ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం మహానేత వైఎస్సార్ ఒకడుగు వేస్తే సీఎం వైఎస్ జగన్ పది అడుగులేశారని చెప్పారు. ఏపీలో 2,198 మసీదులు ఉన్నాయని, ఒక్కో మసీదులోని మౌజన్, ఇమామ్‌లకు ఏటా రూ.1.98 లక్షలు గౌర వేతనం చెల్లిస్తున్నారని అన్నారు. ఈ 55 నెలల్లో కోట్ల రూపాయలను గౌరవ వేతనంగా అందించిన ఘనత వైఎస్ జగన్‌కే సాధ్యమైందని పేర్కొన్నారు. ఏపీలోని సుమారు రూ.2.20 కోట్ల ముస్లింలు వైఎస్ జగన్ వెంటే ఉన్నారని అన్నారు.

మహానేత వైఎస్సార్ బాటలో సీఎం జగన్..



అంజుమాన్ కమిటీ మాజీ చైర్మన్ షేక్ మొయినుద్దీన్ మాట్లాడుతూ మహానేత వైఎస్సార్‌పై నమ్మకంతో 2004, 2009 ఎన్నికల్లో ఆయన్ను ముస్లింలు మళ్లీ గెలిపించారని చెప్పారు. అదేస్ఫూర్తితో వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలిచి, గెలిపించారని అన్నారు. 4 శాతం రిజర్వేషన్ అమలుతో ఎందరో వైద్యులు, ఇంజినీర్లు మైనార్టీల ప్రతి ఇంట్లో ఉన్నారని, అందుకు మహానేత వైఎస్సారే కారణమని చెప్పారు. తండ్రి బాటలో వైఎస్ జగన్ వెళ్తున్నారని అన్నారు.

రూ.26వేల కోట్ల నగదు బదిలీ..



ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు మాట్లాడుతూ 55 నెలల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు సుమారు రూ.26 వేల కోట్ల నగదు బదిలీ జరిగిందని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా అసత్య ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షాలకు తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

పెత్తందార్లకు బుద్ధి చెప్పాలి..



బెటర్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాలు అధికారంలోకి వస్తే దోచుకోవచ్చు, దాచుకోవచ్చుననే ఆలోచనతో కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అటువంటి పెత్తందార్లకు బుద్ధి చెప్పాలని అన్నారు. పేదలకు అన్ని విధాల అండగా ఉంటున్న సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికి మరోసారి తోడుగా నిలవాలని చెప్పారు. మైనార్టీలతోపాటు అన్ని వర్గాల అభివృద్ధికై నిరంతరం శ్రమించే ఏకైక సీఎం వైఎస్ జగన్ అని చెప్పారు.

పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్య



ఆచార్యులు శరత్ జ్యోత్స్న రాణి మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఇంగ్లిష్ చదవాలనే ఒక ఆశ ఉండేదని అన్నారు. ఆ ఆశను నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలు చేశారని చెప్పారు. అందరి గురించి ఆలోచించే మానవత్వం ఉన్న మనిషి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు జిల్లాకే గర్వకారణం

గుంటూరు నగర కమిషనర్‌కు జిల్లా కలెక్టర్ అభినందనలు



గుంటూరు వెస్ట్: గుంటూరు నగరానికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు–2023 రావడం జిల్లాకే గర్వకారణమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరిని, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ జీఎంసీ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా జాతీయస్థాయిలో అవార్డు వచ్చిందన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న స్వచ్ఛ నగరాల విభాగంలో ఈ అవార్డు వచ్చిందన్నారు.

22న తుది ఓటర్ల జాబితా విడుదల

జిల్లాలోని ఎస్ఎస్ఆర్–2024 డ్రాఫ్ట్ జాబితాకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలను, క్లెయిమ్స్‌ను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిష్కరించామని ఈ నెల 22న ఓటర్ల తుది జాబితా విడుదలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాప్రతినిధుల, అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 12 నాటికి క్లెయిమ్స్ పరిష్కరించి పేర్లను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేశామన్నారు. జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు..

జిల్లాలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి చెప్పారు. కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్‌లు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు, పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈనెల 27వ తేదీలోపు మౌలిక సదుపాయాల కల్పన పూర్తి చేయాలని తెలిపారు.

దేశం ఆపషోపాలు !

- అధికారంలో ఉన్నప్పుడు అంబేడ్కర్ విగ్రహ నిర్మాణాన్ని పునాదులకే పరిమితం చేసి ఇప్పుడు ఎల్లో మీడియాలో గగ్గోలు
- స్మృతివనం వెతుక్కుంటూ మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, వర్ల రామయ్యల రాకను చూసి నవ్వుకున్న దళిత, బహుజనులు
- అధికారంలో ఉన్నప్పుడు అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి ఇటుక సైతం వేయని చంద్రబాబు
- అప్పట్లో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా ఉండి, ప్రశ్నించని నక్కా ఆనందబాబు నేడు హడావుడి చేయడంపై సర్వత్రా విమర్శలు
- విజయవాడ నడిబొడ్డులో ఏర్పాటు చేస్తే ఓ వర్గాన్ని అణిచివేసినట్లేనన్న వర్ల రామయ్య వ్యాఖ్యలపై ముక్కునవేలేసుకున్న ప్రజలు



ముళ్ల తుప్పల్లో పునాదులు కూడా పూర్తవని స్మృతివనం ప్రాంతాన్ని వెతుకుతున్న నక్కా ఆనందబాబు



విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి నక్కా, వర్ల రామయ్య

తాడికొండ: చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్న చందంగా తెలుగుదేశం పార్టీలోని దళిత నాయకుల పరిస్థితి తయారైంది. అధికారంలో ఉన్నప్పుడు రాజధాని ప్రాంతంలో ఉన్న అంబేడ్కర్ స్మృతివనంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి కనీస చొరవ చూపని టీడీపీ నాయకులు, సాక్షాత్తు ఆ శాఖ మంత్రిగా ఉండి పునాదులు దాటి నిర్మాణం చేయలేని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఇప్పుడు ఆ స్మృతివనం వెతుక్కుంటూ తుళ్లూరు మండలం శాఖమూరుకు బుధవారం వచ్చి మీడియాతో మాట్లాడారు. 'ఇక్కడే ఉండాలి కదా ఎక్కడుంది' అంటూ తుప్పల్లో తిరుగుతూ ప్లాఫ్ షో చేశారు. 5 సంవత్సరాలు అధికారంలో ఉండి, మంత్రిగా కూడా పనిచేసి అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం బాధ్యత అప్పగిస్తే నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతగానితనాన్ని ప్రశ్నించలేని నక్కా ఆనంద్ బాబు వైఎస్సార్ సీపీపై ఆ నెపం నెట్టేందుకు నానా తంటాలు పడ్డారు.

• జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, ఆ నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న తెనాలి శ్రావణ్ కుమార్ లేకుండానే హడావుడిగా స్మృతివనం ప్రాంతానికి చేరుకొని నక్కా ఆనంద్‌బాబు అప్పుడే మనం కొంత పూర్తి చేశాం కదా అని తిరిగినా కనీసం పునాదుల వరకు కూడా నిర్మాణం జరగలేదని తెలుసుకొని వెనుదిరిగి అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకోవడంపై ఆ పార్టీ నేతలే విస్తుపోయారు. టీడీపీ అధికార ప్రతినిధి వర్ల రామయ్య కోసం అరగంటకు పైగా వేచిచూసినా ఆయనకు అడ్రస్ అర్థంకాకపోవడంతో కొంతమంది వెళ్లి తోడ్కొని వచ్చారు. ఆయన హడావుడిగా సమావేశంలో ప్రసంగించారు. ఆత్మస్తుతి, పరనింద అన్న చందంగా అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహ నిర్మాణంపై బురద చల్లేందుకు యత్నించి తమ హయాంలో ఏం చేశామనేది స్పష్టంగా చెప్పలేక తడబడ్డారు. పునాదుల స్థాయికి కూడా నిర్మాణం పూర్తి చేయని స్మృతివనం ప్రాంతానికి తాము రూ.36 కోట్లు ఖర్చుపెట్టామని మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు ప్రగల్బాలు పలకగా, వర్ల రామయ్య మాత్రం విలేకరుల సమావేశంలో పొంతనలేని మాటలు మాట్లాడారు.

• అంబేడ్కర్ స్మృతివనం పేరుతో విజయవాడలో ఓ వర్గాన్ని అణిచివేయాలని కక్షతో నడిబొడ్డులో విలువైన స్వరాజ్య మైదానాన్ని ఈ రకంగా ఉపయోగించడం మంచిది కాదని మాట్లాడటంతో అందరూ ముక్కున వేలేసుకున్నారు. రూ. 3వేల కోట్ల విలువైన భూమిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం కోసం ప్రభుత్వం కేటాయించి అతి తక్కువ సమయంలో సామాజిక న్యాయ శిల్పం ఏర్పాటు చేస్తే అక్కడ వద్దు ఈ ముళ్ల తుప్పల్లో ఏర్పాటు చేయాలని వర్ల రామయ్య మాట్లాడటంపై పలువురు పెదవి విరిచారు. అమరావతి పేరుతో నిలువు దోపిడీ చేసిన చంద్రబాబు ఆ కేసుల్లో ఇరుక్కొని విలవిల్లాడుతుంటే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు విజయవాడ నడిబొడ్డులో స్థానం కల్పిస్తే అక్కడ వద్దని వర్ల రామయ్య మాట్లాడటంపై పలువురు విస్తుపోయారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఇక్కడ స్మృతివనం నిర్మిస్తామని చెప్పి ఎల్లో మీడియాలో ఊదరగొట్టి వెళ్లిపోయారు. అంబేడ్కర్ స్మృతివనం ఇప్పటికిప్పుడు టీడీపీ నాయకులకు గుర్తుకురావడం విడ్డూరమని, అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారంటూ పలువురు వారి తీరుపై మండిపడ్డారు. దేశంలోనే అతిఎత్తయిన అంబేడ్కర్ విగ్రహం ప్రారంభోత్సవం ఈనెల 19న జరగనున్న సమయంలో వైఎస్సార్ సీపీకి ఎక్కడ మంచి పేరు వస్తుందో అనే ఆందోళనతో టీడీపీ రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు టీడీపీ దళిత నేతలు ఇచ్చి హడావుడి చేశారని, అయితే వారి చేతకానితనాన్ని వారే బయటపెట్టుకుని, అభాసుపాలయ్యారని పలువురు వ్యాఖ్యానించారు. మొత్తానికి టీడీపీ నేతల అంబేడ్కర్ స్మృతివనం యాత్ర అట్టర్ ప్లాఫ్‌షోగా మిగిలిందని ఆ పార్టీ నేతలే వ్యాఖ్యానించారు.

విశ్వమానవుడు అంబేడ్కర్

- విజయవాడలో ఆవిష్కరించనున్నది విగ్రహం కాదు.. సామాజిక విప్లవం
- రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజిని


పట్నంబజారు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఒక ప్రాంతానికో, ఒక రాష్ట్రానికో, ఒక దేశానికో పరిమితమైన వ్యక్తి కాదని, విశ్వమానవుడు అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని పేర్కొన్నారు. కొరిటెపాడు ప్రధాన రహదారిలో వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ సీపీ ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ ఈ నెల 19న విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవాన్ని విజయంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. జగనన్న ప్రభుత్వం నిర్మించింది విగ్రహం మాత్రమే కాదని.. బడుగు, బలహీన వర్గాల కలలను సాకారం చేసే ఒక గొప్ప కట్టడమని, అంబేడ్కర్ స్మృతివనం ఒక విప్లవమై నిలుస్తుందన్నారు. అంబేడ్కర్ ప్రతిపాదించిన సిద్ధాంతం విశ్వమానవాళికి ఉపయోగపడేదని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అణగారిన జాతులకు ఆశాదీపం అంబేడ్కర్ అని కొనియాడారు. అలాంటి గొప్ప వ్యక్తికి జగనన్న దేశంలోనే కనివిని ఎరుగని నివాళి అర్పిస్తున్నారని, ఆయన స్ఫూర్తి కొనసాగేలా అద్భుత కార్యక్రమానికి నడుం బిగించారన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు, బడుగు, బలహీనవర్గాల ప్రజలంతా వెల్లువలా తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిస్తున్నాం: ఎమ్మెల్యే మద్దాళి గిరి

గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాల కొనసాగింపే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు నడుస్తోందన్నారు. 19న జరిగే కార్యక్రమానికి కార్యకర్తలందరితో తాము కలిసి వస్తామన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్‌లు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని స్పష్టం చేశారు. డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ముఖ్యనేతలు, డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు, క్లస్టర్, మండల ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, డివిజన్ల వారీ పార్టీ కమిటీల మెంబర్లు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం


జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: దేశంలో అన్ని వర్గాల ప్రజలు సమానత్వంతో, సమాన హక్కులతో సుభిక్షంగా జీవించడానికి భారత రాజ్యాంగాన్ని అందించిన ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి కొనియాడారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశమందిరంలో నిర్వహించిన సామాజిక సమతా సంకల్పయాత్ర జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 206 అడుగుల భారీ విగ్రహావిష్కరణ జరుగుతోందన్నారు. అంబేడ్కర్, స్వాతంత్య్ర సమరయోధుల జీవిత విశేషాలు, వారి గొప్పతనాన్ని భావితరాలకు అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. బి.ఆర్.అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహాన్ని చూసే ప్రతి ఒక్కరికీ ఎంతో స్ఫూర్తి కలుగుతోందన్నారు. ప్రపంచ మేధావిగా నీరాజనాలు అందుకుంటున్న ఆమహనీయుని విగ్రహావిష్కరణ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కలెక్టర్ కోరారు. అనంతరం ఆవరణలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ ఫొటో ఎగ్జిబిషన్, ఆయన జీవిత విశేషాలను వీక్షించారు. జేసీ రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్ఓ చంద్రశేఖరరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు రవీంద్రరావు, రజనికుమారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యార్డుకు 82,687 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు బుధవారం 82,687 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 78,137 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 22,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,500 నుంచి రూ.17,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.15,500 నుంచి 15,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. యార్డులో ఇంకా 38,422 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

క్లుప్తంగా

తుమ్మలపాలెంలో అసిస్టెంట్ లైన్‌మెన్ హత్య

వివాహేతర సంబంధమే కారణం



ప్రత్తిపాడు: వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ అసిస్టెంట్ లైన్‌మెన్ దారుణ హత్యకు గురైన ఘటన మండలంలోని తుమ్మలపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అసిస్టెంట్ లైన్‌మెన్ రూఫ్‌కుమార్ నాయక్ (35)కు అదే గ్రామానికి చెందిన వివాహితతో కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఏడుగంటల సమయంలో రూఫ్‌కుమార్ నాయక్ వివాహిత ఇంటికి వెళ్లగా అదే సమయంలో బయటకు వెళ్లి ఇంటికి వచ్చిన వివాహిత భర్త అర్జునరావు తలుపులు వేసి ఉండటాన్ని గమనించాడు. దీంతో విచక్షణ కోల్పోయి తలుపులు గట్టిగా కొట్టడంతో కాస్సేపటికి తలుపు తీశారు. ఇదే సందర్భంలో అసిస్టెంట్ లైన్‌మెన్‌కు, అర్జునరావుకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుని చివరికి ఒకరిపై ఒకరు మారణాయుధాలతో దాడులు చేసుకున్నారు. అర్జునరావు నాయక్‌పై గొడ్డలితో దాడి చేయగా, నాయక్ కత్తిపీటతో దాడి చేశాడు. ఈ పెనుగులాటలో నాయక్ తలపై అర్జునరావు గొడ్డలి వేటు వేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్ర బాబు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అర్జునరావు రక్తపు మడుగులో ఉండటంతో పోలీసులు ఆస్పత్రికి తరలించారు. కాగా అర్జునరావు భార్య పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న డీఎస్పీ షేక్ మహబూబ్ బాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు రక్తదాన శిబిరం

గుంటూరు మెడికల్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహావిష్కరణను పురస్కరించుకుని సామాజిక సమతా సంకల్పం నినాదంతో ఈనెల 18వ తేదీ ఉదయం 9.00 గంటలకు గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో రక్తదాన శిబిరం జరుగుతుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగస్తులు, జిల్లాలోని ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో పాటు సమాజ శ్రేయస్సును కోరే యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదాన శిబిరంలో పాల్గొని రక్త దానం చేయాలన్నారు.

తెనాలి టీడీపీలో విభేదాలు బహిర్గతం

- సర్వసభ్య సమావేశానికి సీనియర్ల గైర్హాజరు
- పట్టించుకోని డాక్టర్ గోగినేని ఉమ వర్గం
- లోకేశ్‌ను కలిసిన ఆలపాటి, మారిన అనుచరుల స్వరం

తెనాలి : తెనాలి సీటు విషయంలో టీడీపీలో విభేదాలు బహిర్గతమయ్యాయి. జనసేనకు టికెట్ కేటాయిస్తే ఊరుకునేది లేదంటూ ఆలపాటి వర్గీయులు హడావుడి చేశారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన పార్టీ సమావేశానికి సీనియర్లు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ వర్గం దూరంగా ఉన్నారు. ఆలపాటి రాజా మంగళగిరిలో లోకేశ్‌ను కలిసొచ్చాక ఆయన వర్గీయుల్లోనూ స్వరం మారింది. మూకుమ్మడి రాజీనామాలంటూ చేసిన హెచ్చరికలు డాంబికాలేనని తేలిపోయింది. టీడీపీ, జనసేన పార్టీల పొత్తుల్లో భాగంగా తెనాలి అసెంబ్లీ సీటును జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌కు ఖాయమవుతోందన్న పరిస్థితుల్లో టీడీపీ రచ్చ చేసిన విషయం తెలిసిందే. పార్టీ నాయకులు, కొందరు కౌన్సిలర్లు మంగళవారం గుంటూరులో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ నివాసానికి వెళ్లి హడావిడి చేశారు. ఎనిమిది మంది పార్టీ కౌన్సిలర్లు, పార్టీ పదవుల్లోని వారు రాజీనామా చేస్తామని కూడా రాజా ఎదుట హెచ్చరికలు చేసిన విషయం విదితమే. ఇందుకోసమేనంటూ తెనాలిలో అత్యవసర సర్వసభ్య సమావేశం ప్రకటన కూడా చేశారు. అధిష్టానంపై తన అసంతృప్తిని చాటేందుకు రాజా నడిపించిన మంత్రాంగంతోనే ఈ డ్రామా జరిగిందనే చర్చ తెనాలిలో నడుస్తోంది.



2009లో టికెట్‌తో తన వద్దకు వచ్చిన ఆలపాటితో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉమ నిరసన

లోకేశ్‌ను కలిశాక మారిన స్వరం

ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం చంద్రబాబును కలిసేందుకు ఆలపాటి రాజా మంగళగిరి వెళ్లారు. అక్కడ చంద్రబాబు అందుబాటులో లేకపోవడంతో లోకేశ్‌ను కలిసి వచ్చారు. ఆ తర్వాత పార్టీ వర్గాల స్వరం మారిందంటున్నారు. సాయంత్రం ఇక్కడి ఎస్వీఆర్ కళ్యాణ మండపంలో ఏర్పాటైన అత్యవసర సర్వసభ్య సమావేశంలో మూకుమ్మడి రాజీనామాల ఊసే లేదు. ఆలపాటి రాజాకు సీటు ఇవ్వాలని, లేకుంటే పోరాడతామని కొందరు నాయకులు ప్రసంగించారు. ఏడు శాతం ఓట్లు కూడా లేని నాదెండ్ల మనోహర్‌కు టికెట్ ఇస్తే ఎలాగని ప్రశ్నించారు. ఆలపాటి రాజా ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని కూడా పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా, ఆ సమావేశానికి టీడీపీ సీనియర్లు ముఖం చాటేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ వర్గీయులు ఆ సమావేశాన్ని అస్సలు పట్టించుకోనేలేదు. అవకాశవాదం, డబ్బు ప్రాతిపదికగా చంద్రబాబు తరచూ పార్టీ అభ్యర్థులను మారుస్తారనేది అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో 1999లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన డాక్టర్ గోగినేని ఉమ, 2004లో ఓటమి చెందారు. 2009 ఎన్నికలొచ్చేసరికి వేమూరు నియోజకవర్గం నుంచి వచ్చిన ఆలపాటి రాజాకు తెనాలి సీటును కేటాయించారు. ఆ ఎన్నికల్లో తెనాలి నుంచి తనకు, వేమూరు నుంచి నక్కా ఆనందబాబుకు, గుంటూరు పశ్చిమ నుంచి చుక్కపల్లి రమేష్‌కు ముగ్గురి టికెట్లను చంద్రబాబుతో బేరమాడి ఆలపాటి సాధించుకున్నారని ప్రచారం జరిగింది. ఏళ్ల తరబడి పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉమను పక్కన పెట్టటం, తర్వాత స్థానంలో ఉన్న తనకు సైతం అవకాశం ఇవ్వకపోవడంతో నాడు టీడీపీలో ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తన మద్దతుదార్లతో సమావేశం నిర్వహించారు. అయినా అప్పట్లో చంద్రబాబు డాక్టర్ ఉమ, శివకుమార్‌లను ఖాతరు చేయలేదు. ఆలపాటి రాజాకే టికెట్ కేటాయించారు. చంద్రబాబుతో ఉన్న లాబీయింగ్‌తో నాడు టికెట్ తెచ్చుకున్న ఆలపాటికి అప్పట్లో తాము పడిన బాధ గుర్తుకు రాలేదా? అంటూ టీడీపీలోని ఉమ వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయించిన ప్రకారమే పనిచేయాలని కూడా సమావేశానికి హాజరైన పలువురు వ్యాఖ్యానించడం విశేషం.

ఎక్కడి వారికి అక్కడే..!

నాన్ జంబ్లింగ్ పద్ధతిలోనే ఇంటర్ ప్రాక్టికల్స్

- ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ఒకేషనల్, 11 నుంచి సీనియర్ ఇంటర్ సైన్స్ విద్యార్థులకు ప్రారంభం
- గుంటూరు జిల్లాలో 24,330 మంది విద్యార్థులకు 118 కేంద్రాలు ఏర్పాటు
- ఏర్పాట్లలో నిమగ్నమైన ఇంటర్ బోర్డు అధికారులు



ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్స్) నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫిబ్రవరి ఐదో తేదీ నుంచి 20 వరకు ప్రాక్టికల్స్ నిర్వహణకు ఇంటర్మీడియెట్ బోర్డు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో గుంటూరు జిల్లావ్యాప్తంగా 163 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 24,330 మంది విద్యార్థులకు 118 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాన్ జంబ్లింగ్ విధానంలో ఏ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అదే కళాశాలలో ప్రాక్టికల్స్ జరగనున్నాయి. ఇంటర్ వృత్తి విద్యాకోర్సులు చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభం కానుండగా, సీనియర్ ఇంటర్ సైన్స్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 11 నుంచి ప్రాక్టికల్స్ జరగనున్నాయి. ప్రాక్టికల్స్‌కు హాజరు కానున్న విద్యార్థుల్లో ద్వితీయ సంవత్సర ఎంపీసీ, బైపీసీ విభాగాల నుంచి 22,288 మంది విద్యార్థులు ఉండగా, ఒకేషనల్ ప్రథమ సంవత్సరం 1010, ద్వితీయ సంవత్సరం నుంచి 1032 మంది విద్యార్థులు ఉన్నారు.

- ఇంటర్మీడియెట్ బోర్డు ఉత్తర్వుల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలను పరిశీలించిన అధికారులు ఆయా కళాశాలల్లోని ప్రయోగశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వహణకు వీలుగా అవసరమైన పరికరాలు, రసాయనాలు అనువుగా ఉన్నవీ, లేనిదీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పూర్తిస్థాయిలో వసతులు ఉన్న కళాశాలనే ప్రాక్టికల్స్ నిర్వహణకు ఎంపిక చేసినట్లు ఆర్ఐఓ జీకే జుబేర్ చెప్పారు. గతేడాది నిర్వహించిన ప్రాక్టికల్స్‌లో జిల్లాలోని పలు ప్రైవేటు కళాశాలల్లో సరైన వసతులు లేని విషయాలను పరిగణలోకి తీసుకుని, ప్రతి కళాశాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి బోర్డు నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా పరికరాలు, రసాయనాలు అందుబాటులో ఉన్నవీ, లేనివీ పరిశీలించిన తరువాతే ప్రాక్టికల్ కేంద్రాలను ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ప్రాక్టికల్స్ పర్యవేక్షణకు అవసరమైన మేరకు అన్ని సబ్జెక్టులను బోధించే అధ్యాపకులను విధుల్లో నియమించేందుకు కసరత్తు చేస్తున్నామని తెలిపారు.

స్వచ్ఛ గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం

వికసిత్ భారత్–సంకల్ప యాత్ర జిల్లా పరిశీలకులు సాల్‌మన్ ఆరోఖ్యరాజ్



పురుగు మందును పిచికారీ చేస్తున్న డ్రోన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కొమ్మూరు(కాకుమాను): దేశంలోని ప్రతీ గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా మార్చాలనే లక్ష్యంతోనే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా పని చేస్తున్నారని సీనియర్ ఐఏఎస్ అధికారి, జాయింట్ సెక్రటరీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ మినిస్టరీ ఆఫ్ ఫైనాన్స్ గవర్నమెంట్ అధికారి (వికసిత్ భారత్–సంకల్ప యాత్ర) జిల్లా పరిశీలకులు సాల్‌మన్ ఆరోఖ్యరాజ్ అన్నారు. మండలంలోని కొమ్మూరు గ్రామ సచివాలయం వద్ద బుధవారం వికసిత్ భారత్–సంకల్ప యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 సంవత్సరం నాటికి దేశంలో ప్రతి గ్రామంలో ప్రజలకు కావల్సిన అన్ని సౌకర్యాలను కల్పించడంతో పాటు ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా మార్చాలనే లక్ష్యంతో దేశ ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. గ్రామాలలో ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతో ఏటా అనేక సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, వివిధ కారణాల వల్ల ఆ పథకాలు అందని అర్హులు అధికారులను సంప్రదించి పొందాలని సూచించారు. కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా దేశంలో ఏ ఒక్క ఇంటిలో కట్టెల పొయ్యి ఉండకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి ఇంటికీ అతి తక్కువ ధరకే గ్యాస్‌ను అందిస్తున్నామన్నారు.

తొలుత వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శాస్త్ర సాంకేతికతని రైతులకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన డ్రోన్ మిషన్ పనితీరును పరిశీలించారు. ఈ మిషన్ల వలన ఎకరాకు 5–10 నిమిషాలలో పురుగు మందులను పిచికారీ చేయవచ్చునని వివరించారు. రైతులు గ్రూపులుగా ఏర్పడి 40 శాతం సబ్సిడీపై ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ శ్రీఖర్ జైన్, డీఏఓ నున్న వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ సీఈఓ మోహనరావు, గ్రామ సర్పంచ్ గేరా జ్యోతి, జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, మండల ప్రత్యేకాధికారిణి తేళ్ల ప్రేమ కుమారి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతరం ఏసుక్రీస్తును నమ్మి పయనించాలి

ఏఈఎల్‌సీ బిషప్ కేఎఫ్ పరదేశిబాబు



మాట్లాడుతున్న బిషప్ పరదేశిబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: యువతరం ఏసుక్రీస్తు ప్రభువును నమ్మి జీవిత పయనాన్ని కొనసాగించాలని ఏఈఎల్‌సీ మోస్ట్ రెవరెండ్ బిషప్ డాక్టర్ కేఎఫ్ పరదేశి బాబు పేర్కొన్నారు. ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ సంఘం (ఏఈఎల్‌సీ) ఆధ్వర్యంలో ఏసీ కళాశాలలో బుధవారం యూత్ కన్వెన్షన్-2024 ముగింపు సభ జరిగింది. ఈసందర్భంగా పరదేశిబాబు మాట్లాడుతూ యూత్ కన్వెన్షన్‌లో రెండు వేల మంది ఒకేసారి పాల్గొనటం సంతోషకరమని, వీరందరూ దేవుని వైపు నడచి ఏసుక్రీస్తు ప్రభువు దీవెనలు పొందటం ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. అనంతరం యూనివర్సిటీ-క్రిస్టియన్ ఐడెంటిటీ అనే అంశంపై బ్రదర్ సురేష్ వంగూరి ఉపన్యసించారు. అదే విధంగా యూఎస్‌ఏలోని చికాగోకు చెందిన లూథరన్ వరల్డ్ ఫెడరేషన్ యూత్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెవరెండ్ సవన్నా యూత్ కన్వెన్షన్‌కు హాజరైన యువతీ, యువకులతో వర్చువల్‌గా చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు. సేవ్ నేచర్‌లో భాగంగా ప్రకృతి ప్రాధాన్యత-పరిరక్షణలో యువత పాత్ర అనే అంశంపై ప్రసంగించారు. పోలాండ్‌లో జరిగిన ఏఈఎల్‌సీ క్లైమైట్ జస్టిస్‌పై జరిగిన సదస్సులో పాల్గొన్న నలుగురు యువతీ, యువకులతో చర్చించారు.

యువతను దేవుని వైపు నడిపించడంలో ఏఈఎల్‌సీ చేస్తున్న కృషిని తెలుసుకుని, ఎల్‌డబ్ల్యూఫ్, ఏఈఎల్‌సీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. చెన్నైకు చెందిన యూఈఎల్‌సీఐ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ జాషువా పీటర్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో క్రైస్తవ యువతీ, యువకుల పాత్ర, భవిష్యత్ తరంలో ఏఈఎల్‌సీ పాత్రను వివరించారు. యూత్ కన్వెన్షన్-2024 కన్వీనర్ కె.రవితేజ మాట్లాడుతూ యువత దేవుని వైపు నడవడంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, ప్రస్తుత సమాజంలో ఎదురవుతున్న సవాళ్లను కూలంకషంగా చర్చించారు. సినడ్ స్థాయిలో యువత చేయాల్సిన కార్యక్రమాలతో పాటు యువత దేవుని వైపు నడవాల్సిన ఆవశ్యకతపై దిశా నిర్దేశం చేశారు. సదస్సు ఆద్యంతం దేవుని సువార్తను యువతకు ప్రకటించడంలో తీసుకోవాల్సిన చర్యలతో పాటు తదుపరి కార్యాచరణను ప్రకటించారు.

కార్యక్రమంలో ఏఈఎల్‌సీ ప్రథమ మహిళ ఆశా కిరణ్ పరదేశి బాబు, కార్యదర్శి చెన్నం కిషోర్, కోశాధికారి మోజెస్ ఆర్నాల్డ్, ఆరు సినడ్‌ల బిషప్స్, కౌన్సిల్ సభ్యులు, ఏఈఎల్‌సీ యూత్ ఇవాంజెలిస్ట్ రెవరెండ్ శ్రీకాంత్ జేమ్స్ ఆర్ఆర్‌కే, ఏఈఎల్‌సీ యూత్ మినిస్ట్రీ ఇన్‌చార్జ్ రెవరెండ్ సతీష్, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజెస్ పాల్గొన్నారు.

డ్రైవర్లు మద్యంకు దూరంగా ఉండాలి

పీటీడీ జిల్లా అధికారి శ్రీనివాసరావు



నరసరావుపేట: బస్సులు నడిపే సమయంలో డ్రైవర్లు సెల్‌ఫోన్, మద్యానికి దూరంగా ఉండాలని జిల్లా ప్రజారవాణా అధికారి ఎస్వీ శ్రీనివాసరావు కోరారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభం సందర్భంగా బుధవారం గ్యారేజ్ ఆవరణలో రోడ్డు భద్రతపై సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రూనాయక్ మాట్లాడుతూ డ్రైవర్లు ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. కంటి నిండా నిద్ర కూడా పోవాలని డ్రైవర్లకు సూచించారు. కార్యక్రమానికి డిపో మేనేజర్ బి.వీరాస్వామి అధ్యక్షత వహించారు.

ఆదర్శమూర్తి అంబేడ్కర్

- విగ్రహానికి పూలమాలలతో నివాళి
- స్మృతివనంలో విగ్రహావిష్కరణకు తరలిరావాలని పిలుపు
- నేడు కోనేరుసెంటరు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు మారథాన్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న షాహిద్‌బాబు

మచిలీపట్నంటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శమూర్తి అని పలువురు వక్తలు అన్నారు. విజయవాడలోని స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఈ నెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం మచిలీపట్నంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ షేక్ షాహిద్‌బాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు (జాని), కో-ఆప్షన్ సభ్యులు బేతపూడ రవి, మట్టా తులసి, దళిత జేఏసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీ గురువారం మచిలీపట్నం కోనేరుసెంటరు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు మారథాన్ పరుగు నిర్వహించనున్నట్లు తెలిపారు. విగ్రహావిష్కరణకు మద్దతుగా జిల్లాలో 27,432 మంది ఫ్లెక్సీ బ్యానర్లపై సంతకాలు చేశారన్నారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు గంద్రపు శీనయ్య మాస్టారు మాట్లాడుతూ దళితుల అభివృద్ధి సీఎం జగన్ పాలనకు ముందు, తరువాతగా చెప్పుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో దళిత జేఏసీ నాయకులు బూరగ రామారావు, శోభన్‌కుమార్, ఉచ్చుల గణేష్, కొడమంచిలి చంద్రశేఖర్, దమ్ము కేశవ, దార్ల చెన్నకేశవరావు, అరిసె శ్రీహరి, మాజీ సర్పంచ్ సుబ్బారావు, గుమ్మడి విద్యాసాగర్, కర్ర సునీల్‌కుమార్, బేతపూడి మనోహర్, మద్దాల కృష్ణకుమార్, కొసనం క్రాంతికుమార్, సోషల్ వెల్ఫేర్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేద్దాం

- కలెక్టర్ రంజిత్‌బాషా
- కార్యక్రమం తీరుతెన్నులపై అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల అర్బన్: సామాజిక సమతా సంకల్పం మారథాన్ మానవహారం కార్యక్రమం బాపట్లలో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాల నిర్వహణపై కమిటీలోని జిల్లా స్థాయి అధికారులతో బుధవారం ఆయన తన చాంబర్లో సమీక్షించారు. అనంతరం ఆర్డీవోలు, మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారతరత్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణలో భాగంగా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. ఈ నెల 18న గురువారం ఉదయం 9 గంటలకు బాపట్లలోని మున్సిపల్ హై స్కూల్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించాలన్నారు. తదుపరి సూర్యలంక రోడ్డులోని అగ్రికల్చర్ కళాశాల ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు వేడుకలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయిలో జరిగే కార్యక్రమాల్లో ప్రజలు విరివిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమాలలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలన్నారు. అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాలలో పాల్గొనేందుకు గ్రామ సచివాలయాల ద్వారా వేల సంఖ్యలో ప్రజలు తమ పేర్లు నమోదు చేసుకున్నారని ఆయన తెలిపారు. ముందస్తుగా పేర్లు నమోదు చేసుకున్న వారంతా సురక్షితంగా విజయవాడ వెళ్లడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి జె.రాజదిబోరా, డీఈవో రామారావు, డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ కృష్ణ, వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు

నరసరావుపేట: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు కార్పొరేట్ వైద్యం చేరువ అయిందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో బుధవారం బాబాపేట యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో మూడో వార్డు ప్రజలకు స్థానిక సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు వేర్వేరుగా పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బందికి తగిన సూచనలు అందజేశారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు చెందిన ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు చక్రవర్తి, మెడికల్ సర్జన్ నజియా, పీహెచ్‌సీ వైద్యులు పర్వీను, డాక్టర్ జి.హర్షవర్ధన్‌రెడ్డి 308మందిని పరీక్షించి మందులు ఉచితంగా అందజేశారు. వీరిలో మహిళలు 171మంది ఉండగా పురుషులు 136మంది, నలుగురు పిల్లలు, ఆరుగురు గర్భవతులతో పాటు 26 మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించి ఒకరికి కళ్లజోడు అందజేశారు. శిబిరాన్ని డాక్టర్ హర్షవర్ధనరెడ్డి పర్యవేక్షించారు.

బాలికపై ఉపాధ్యాయుడి లైంగిక దాడి

- ఆలస్యంగా వెలుగు చూసిన వైనం
- నిందితుడి అరెస్ట్ కోరుతూ రాస్తారోకో
- డీఎస్పీ హామీతో ఆందోళన విరమణ



ఆందోళనకారులతో మాట్లాడుతున్న గురజాల డీఎస్పీ పల్లపురాజు

పిడుగురాళ్లరూరల్: బాలికపై ఓ ఉపాధ్యాయుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన పల్నాడు జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పదేళ్ల బాలిక చదువుతోంది. కొన్ని రోజులుగా బాలిక అనారోగ్యంతో బాధపడుతోంది. స్థానిక వైద్యశాలకు తీసుకెళ్లగా వైద్యులు బాలికపై లైంగిక దాడి జరిగి ఉండవచ్చననే అనుమానంతో గుంటూరు సమగ్ర ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో తల్లిదండ్రులు ఉపాధ్యాయుడు ఘాతుకానికి పాల్పడి ఉంటాడని ఆరోపించారు. పిడుగురాళ్ల పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో బాలికకు గుంటూరు జీజీ హెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలుస్తోంది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దిశ డీఎస్పీ రవిచంద్ర తెలిపారు.

నిందితుడిని అరెస్ట్ చేయాలి

పిడుగురాళ్ల రూరల్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని బాలిక తల్లిదండ్రులు, బంధువులు అద్దంకి– నార్కెట్‌పల్లి హైవేపై బుధవారం రాస్తారోకో చేశారు. రెండు గంటలపాటు రాస్తారోకో చేపట్టారు. రహదారికి ఇరువైపులా సుమారు 5 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న గురజాల డీఎస్పీ పల్లపురాజు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, కేసు నమోదు చేసి, శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో రాస్తారోకో విరమించారు.